

చీనీ టన్ను రూ.29,400

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.29,400, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.26

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.26, కనిష్టంగా రూ.13, సరాసరిన రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
28.1°/19.7°

జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. చలి వాతావరణం నెలకొంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టంపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లతో పాటు ప్రోత్సహించే వైద్యులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలుపై కలెక్టర్ చేతన్ అధ్యక్షతన మల్టీ మెంబర్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. చట్టం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులు చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, లింగనిర్ధారణ చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని, ఇందుకు వైద్య, ఆరోగ్య సిబ్బందితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలను భాగస్వామ్యం చేసుకుని గ్రామగ్రామానా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని స్కానింగ్ సెంటర్ల వివరాలను పక్కాగా నమోదు చేయాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. రిజిస్టర్ చేసుకోని స్కానింగ్ సెంటర్లపై, లింగ నిర్ధారణ పరీక్షలు జరిపే స్కానింగ్ సెంటర్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు జడ్జి శైలజ, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్, ఆర్డీటీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై దృష్టి సారించండి

- ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి
- సిబ్బందికి ఎస్పీ రత్న ఆదేశం




సమావేశానికి హాజరైన కోర్టు కానిస్టేబుళ్లు
మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: రాజీకాదగిన కేసుల్లో ఇరువర్గాలను పిలిపించి ఈనెల 14వ తేదీన జరిగే లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ఎస్పీ రత్న సిబ్బందికి సూచించారు. శనివారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కోర్టు కానిస్టేబుళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పెండింగ్ కేసుల్లోని కక్షిదారులకు ఈనెల 14న జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ, సమయం తగ్గుతుందని ఇరువర్గాలకు తెలియజెప్పాలన్నారు. తద్వారా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో సీఐలు శ్రీనివాసులు, శివాంజనేయులు, పోలీసు లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జ్ సుదర్శన్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


జనసేన నేత ఇసుక దందా

- ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు
- పోలీసులకు అప్పగింత



పోలీసుల ఆధీనంలో ఉన్న ఇసుక ట్రాక్టర్.. చిత్రంలో జనసేన నేత సురేష్

పరిగి: మండల జనసేన పార్టీ కన్వీనర్ చిన్నపల్లి సురేష్ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడ్డాడు. శనివారం మండలంలోని పైడేటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపంలోని పెన్నానదిలో ఇసుకను తవ్వి, ట్రాక్టరులో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డగించారు. సురేష్ తరచూ ఇసుకను అక్రమంగా తరలిస్తుండడంతో ఆగ్రహించి..మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) సిద్ధేశ్వర్ అక్కడికి చేరుకుని ఇసుక ట్రాక్టర్‌ను పరిగికి తరలించి, పోలీసులకు అప్పగించారు. కాగా.. పరిగి ఎస్‌ఐ రంగడు యాదవ్ అందుబాటులో లేని కారణంగా ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు చేయలేదని ఏఎస్‌ఐ జయలత తెలిపారు.



'అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం ... అవసరమైతే తగ్గిస్తాం' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన చంద్రబాబు మాట తప్పారు. ప్రజలపై విద్యుత్ భారం మోపేందుకు సిద్ధమైపోయారు. ఈ నెల నుంచి 2026 నవంబర్ వరకు అంటే దాదాపు రెండేళ్ల కాలం పాటు ఇంధన సర్దుబాటు కింద వినియోగదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేయనున్నారు.

ముట్టుకుంటే షాక్

బాబు.. బాదుడే బాదుడు

- సర్దుబాటు పేరుతో భారీ వడ్డన
- నేటి నుంచి పెరగనున్న విద్యుత్ బిల్లులు
- ప్రజల ముక్కుపిండి రూ.1,117 కోట్లు రాబట్టనున్న ప్రభుత్వం
- యూనిట్‌పై 92 పైసల నుంచి రూ.1 పెంపు
- రెండేళ్ల పాటు తప్పని అ'ధన'పు భారం

అనంతపురం టౌన్: గత ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి గెలిచిన చంద్రబాబు నేడు ప్రజలకు అసలైన బాదుడంటే ఏంటో చూపిస్తున్నారు. వినియోగదారులపై విద్యుత్ చార్జీల సర్దుబాటు భారం మోపేందుకు సర్వం సిద్ధం చేశారు. ఇంధన చార్జీల కింద ప్రజల నుంచి వసూళ్లు చేసుకోవాలని డిస్కంలకు అనుమతిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఉత్తర్వులను జారీ చేసింది. రాయలసీమ జిల్లాలకు విద్యుత్ సరఫరా చేసే ఏపీ ఎస్పీడీసీఎల్ సంస్థకు రూ.1,117 కోట్ల మేర సర్దుబాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

నేటి నుంచే..

డిసెంబర్ 1 నుంచి ప్రజలపై విద్యుత్ చార్జీల మోత మోగనుంది. నవంబర్ నెలలో వాడిన విద్యుత్‌కు డిసెంబర్ 1 నుంచి వచ్చే విద్యుత్ బిల్లుకు పెరిగిన విద్యుత్ చార్జీలను జోడిస్తారు. ఇప్పటి వరకూ గృహావసర వినియోగదారులు యూనిట్‌కు రూ.1.26 పైసలు చొప్పున చెల్లించేవారు. ప్రస్తుతం సర్దుబాటు చార్జీల కింద అదనంగా 92 పైసల నుంచి రూ.1 పెంచే దిశగా విద్యుత్‌శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఈ లెక్కన సగటున ఒక యూనిట్‌పై రూ.2.20 పైసల పైగానే భారం పడనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా గృహావసర విద్యుత్ కనెక్షన్లు 13 లక్షలకు పైగానే ఉన్నాయి. రోజువారీ 30 లక్షల యూనిట్ల కరెంటును ప్రజలు వినియోగిస్తున్నారు. సగటున ఒక వినియోగదారుడు రోజుకు 2 నుంచి 3 యూనిట్ల మేర విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నారు. దీంతో పాటు చిన్న, మధ్య, పెద్ద పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో 10 వేలకు పైగానే ఉన్నాయి. ఇంధన సర్దుబాటు చార్జీలతో ఒక్కో వినియోగదారునిపై రోజుకు రూ.3 అనుకున్నా నెలకు రూ. 90 చొప్పున భారం పడనుంది. ఇది కూడా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడిన వారికి మాత్రమే కావడం గమనార్హం. 200 యూనిట్ల పైన కరెంటు వాడుతున్న వారికి స్లాబ్ మారిపోతుంది.

రెండేళ్ల పాటు బాదుడు..

పెరిగిన విద్యుత్ చార్జీలను రెండేళ్ల పాటు అంటే 2026 నవంబర్ వరకు ఇంధన సర్దుబాటు ధరలను జోడించి వినియోగదారులకు బిల్లును అందించనున్నారు. జిల్లాలో దాదాపు రూ. 350 కోట్ల మేర ఇంధన సర్దుబాటు చార్జీలను డిస్కంలకు చెల్లించాల్సి ఉంది. డిస్కంలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయంటూ ఇలా వ్యవహరిస్తుండటం గమనార్హం. తాము అధికారంలోకి వస్తే ప్రజలపై భారం మోపబోమంటూ గతంలో చెప్పిన చంద్రబాబు నేడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తుండటంపై అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.

వచ్చే నెల నుంచి అమలు..



ఇంధన సర్దుబాటు చార్జీలను విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాలని డిస్కంలకు ఏపీఈఆర్‌సీ సూచించింది. ఈ మేరకు ఈ నెల నుంచే విద్యుత్ వినియోగదారుల నుంచి వసూలు చేస్తాం. నవంబర్‌లో వినియోగించిన కరెంటుకు అందించే బిల్లుకే పెరిగిన ధరలను జోడించనున్నాం.

– సంపత్‌కుమార్, ఎస్‌ఈ, విద్యుత్‌శాఖ

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలి

- ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు



మాట్లాడుతున్న ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు

ప్రశాంతి నిలయం: ఎన్నికల సంఘం మార్గదర్శకాలన్నీ పాటిస్తూ తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందించాలని ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ కె.కన్నబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ టీఎస్ చేతన్‌తో కలసి ఓటరు జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఈఆర్‌లు, ఏఈఆర్‌ఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ, క్లెయిమ్‌లు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నూతన ఓటర్లుగా నమోదు చేసే క్రమంలో వివరాలన్నీ పక్కాగా ఉండాలన్నారు. బీఎల్‌ఓలు 100 శాతం ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో అందే ఫిర్యాదులపై పూర్తి విచారణ చేయాలన్నారు. ఇందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులూ సహకరించాలని కోరారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి క్లెయిమ్‌లన్నీ పరిష్కరించాలన్నారు. తొలగింపులకోసం అందే ఫాం–7 దరఖాస్తులన్నీ పరిశీలించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు తొలగింపులు చేపట్టాలన్నారు. జిల్లాలో 14,08,769 మంది ఓటర్లు, 1,576 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా క్లెయిమ్‌ల పరిశీలన జరుగుతోందన్నారు. నవంబర్ 24వ తేదీలోపు వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై నవంబర్ 29వ తేదీ నుంచి విచారణ చేపట్టామన్నారు. 2025 జనవరి 1వ తేదీన ఓటరు తుది జాబితా ప్రచురిస్తామన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, ఆర్డీఓలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్షణ కరువు.. వేధింపుల దరువు

- అక్టోబర్ 11: చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లిలోని ఓ పేపరు మిల్లు వద్ద అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారం జరిగింది. బాధితులు పొట్టకూటికోసం కర్ణాటక నుంచి వలస వచ్చి స్థానికంగా పనులు చేసుకుంటున్నారు. ఐదుగురు యువకులు తప్పతాగి వారిపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కూటమి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆ తర్వాత కూడా కూటమి ప్రభుత్వం అప్రమత్తం కాలేదు.
- ఆగస్టు 2: హిందూపురం మండలం తూముకుంటలో ఏడేళ్ల వయసున్న బాలికను వరుసకు పెదనాన్న అయిన వ్యక్తి దారుణంగా కొట్టి చంపి... పెన్నానదిలోని ఇసుక మేటల్లో మృతదేహాన్ని పూడ్చి పెట్టాడు. ఈ దారుణానికి ఒడిగట్టిన గంగాధర్ అప్పటికే రెండు హత్య కేసుల్లో నిందితుడు. అయినా పోలీసులు అతనిపై నిఘా ఉంచలేకపోవడంతో ఓ తల్లికి కడుపుకోత మిగిలింది.
- తాజాగా మడకశిరలో జరిగిన బాలుడి కిడ్నాప్, హత్య ఘటన కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనడానికి ఉదాహరణగా మారింది. 8వ తరగతి చదువుతున్న చేతన్ కుమార్‌ను ఈ నెల 28న పాఠశాల వద్దే కిడ్నాప్ చేసి హత్య చేశారు. శుక్రవారం కర్ణాటకలోని పావగడ సమీపంలోని అటవీ ప్రాంతంలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు.

- జిల్లాలో గాడి తప్పిన శాంతిభద్రతలు
- చిన్నారులు, మహిళలపై అఘాయిత్యాలు
- 5 నెలల కూటమి పాలనలో దారుణాలెన్నో..
- తాజాగా మడకశిర నియోజకవర్గంలో బాలుడి కిడ్నాప్, హత్య
- చేష్టలుడిగి చూస్తున్న పోలీసులు
- విపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను వేధించడంపైనే సర్కార్ దృష్టి



చేతన్‌కుమార్ (ఫైల్)



బిడ్డను విగతజీవిగా చూసి బోరున విలపిస్తున్న చేతన్ తల్లి (ఫైల్)

మడకశిర: ఐదేళ్ల పాటు ప్రశాంతంగా ఉన్న ప్రాంతాల్లో రక్తపు మరకలు దర్శనం ఇస్తున్నాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా.. మహిళలు, వృద్ధులు అని చూడకుండా.. అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చిన్నారులు, మహిళలకు రక్షణ లేకుండా పోయింది. నిత్యం ఏదో చోట అసాంఘిక ఘటనలు వెలుగు చూస్తున్నాయి. కొన్ని బహిర్గతం అవుతుండగా.. పదుల సంఖ్యలో కేసులు బయటికి రానీయకుండా అధికారం అడ్డు పెట్టుకుని కూటమి నేతలు వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారు. ఫలితంగా శాంతిభద్రతలు అదుపు తప్పి నిత్యం కిడ్నాప్‌లు, హత్యలు, అత్యాచారాలతో జిల్లా వార్తల్లో నిలుస్తోంది. ప్రధానంగా మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైంది. మహిళలపై అత్యాచారాలకు పాల్పడటం, చిన్నారులను కిడ్నాప్ చేసి హత్య చేయడం మామూలైపోయింది.

ఈ ఏడాది జిల్లాలో నేరాలకు సంబంధించిన గణాంకాలు దాదాపుగా ఇలా..

హత్య కేసులు	హత్యాయత్నం	కిడ్నాప్	పోక్సో	రేప్
50 పైగా	80 పైగా	35 పైగా	40 పైగా	40 పైగా

2024 ఆరంభం నుంచి తొలి ఐదు నెలల పాటు నేరాల సంఖ్య గతం కంటే తక్కువగానే ఉంది. కాగా జూన్ తొలివారం నుంచి నేరాల సంఖ్య క్రమక్రమంగా పెరిగింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు నమోదైన నేరాల సంఖ్యలో గడచిన 5 నెలల్లో 70 శాతం పైగా ఉండటం గమనార్హం.

శాంతిభద్రతలను విస్మరించిన ప్రభుత్వం..

జిల్లాలో కిడ్నాప్‌లు, హత్యలు, మాన భంగాలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. విపక్ష పార్టీ నేతలు, కార్యకర్తలను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయించేలా పోలీసులపై ఒత్తిడి తెస్తున్న అధికార పార్టీ నేతలు...వారికి వంత పాడుతున్న పోలీసులు చిన్నారులు, మహిళలపై జరిగే నేరాలను మాత్రం అరికట్టలేకపోతున్నారని జనం మండిపడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై ప్రభుత్వం క్షణాల్లో తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని, కానీ హంతకులు, అత్యాచారానికి పాల్పడుతున్న వారిని మాత్రం చూసీ చూడనట్లు వదిలేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కారణాలెన్నో..

మద్యం ఏరులై పారుతుండటం, విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు, గుట్కా, మట్కా, పేకాట.. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్.. ఇలా ఎన్నో అసాంఘిక కార్యకలాపాలు రాజ్యమేలుతున్నాయి. అడ్డుకోవాల్సిన వ్యవస్థలను కూటమి నేతలు నియంత్రిస్తున్న కారణంగా.. వ్యసనాలకు బానిసలుగా మారిన వ్యక్తులు అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్నారు. ఫలితంగా పేద కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రపంచాన్ని చూడాల్సిన పసిపిల్లలు బాల్యంలోనే తనువు చాలిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఉపాధి కోసం వచ్చి జీవించాలన్నా.. భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రభుత్వ వైఫల్యమే



జిల్లాలో జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. గడిచిన 5 నెలల కాలంలో మహిళలపై సామూహిక అత్యాచారం, చిన్నారుల కిడ్నాప్, హత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. సీఎం చంద్రబాబు, హోం మంత్రి, జిల్లా మంత్రులు స్పందించాలి. నేరాలను అరికట్టడంలో పోలీస్ యంత్రాంగం చేతులెత్తేసినట్లు తెలుస్తోంది.

– ఉషశ్రీచరణ్, జిల్లా అధ్యక్షురాలు, వైఎస్సార్‌సీపీ

మామే మట్టుబెట్టాడు!

- బాలుడి హత్య కేసు దర్యాప్తు వేగవంతం
- ఇప్పటికే పోలీసుల అదుపులో నిందితుడు
- ఓ మహిళ పాత్రపైనా పోలీసుల విచారణ
- మడకశిరలోనే మకాం వేసిన పెనుకొండ డీఎస్పీ



సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

మడకశిర: మండలంలోని ఆమిదాలగొంది జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి చేతన్‌కుమార్(13) హత్య కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. ఈనెల 28వ తేదీ (గురువారం) చేతన్‌కుమార్‌ను పాఠశాల వద్ద ద్విచక్ర వాహనంలో దుండగులు కిడ్నాప్ చేసి పావగడ సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి దారుణంగా హత్య చేశారు. చేతన్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించిన వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ రత్న మడకశిరకు వచ్చి మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం ఈ కేసుపై సమీక్ష చేసి దర్యాప్తునకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ క్రమంలో వీలైనంత త్వరగా నిందితులను పట్టుకుని చట్టం ముందు నిలబెట్టేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మడకశిర టౌన్ సీఐ రామయ్య సిబ్బందితో కలిసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటి వరకూ జరిగిన దర్యాప్తులో బాలుడి మామే దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది.

హత్య కేసులో ముగ్గురి ప్రమేయం..

హత్యకు గురైన బాలుడు చేతన్‌కుమార్ కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానితులపై దృష్టి సారించారు. ప్రధానంగా చేతన్‌కుమార్ మామ టీడీపల్లికి చెందిన అశోక్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని పెనుకొండకు తరలించి లోతుగా విచారించినట్లు తెలిసింది. అయితే శనివారం సాయంత్రం మళ్లీ మడకశిరకు తీసుకువచ్చి వివిధ అంశాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు మడకశిరలో మకాం వేసి దర్యాప్తును పర్యవేక్షిస్తున్నారు. ఈ హత్య కేసులో తొలుత ఒక్కరే పాల్గొన్నట్లు పోలీసులు భావించారు. అయితే అనుమానితుడిని విచారణ చేయగా, మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. బాలుడి హత్య కేసులో ఓ మహిళ పాత్ర ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఆస్తి కోసమే సదరు మహిళ బాలుడిని హత్య చేసేలా నిందితులను ప్రేరేపించినట్లు చర్చ జరుగుతోంది. అంతేకాకుండా హతుడి మామ నడవడికపై కూడా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆస్తి కోసం కాకుండా వేరే కారణంతో ఏమైనా హత్య జరిగిందా.. అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

గతంలోనూ ఇలాంటి ఘటనలు

మడకశిర ప్రాంతంలో చిన్నారులను కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటనలు గతంలోనూ జరిగాయి. 20 ఏళ్ల క్రితం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కిడ్నాప్ చేసి దారుణంగా హతమార్చారు. బంధువులే దారుణానికి ఒడిగట్టడం అప్పట్లో సంచలనమైంది. అదే విధంగా 15 ఏళ్ల క్రితం మడకశిరకు చెందిన ఉపాధ్యాయ దంపతుల కుమారుడు, కుమార్తెను ఇంట్లోనే దారుణంగా హత్య చేశారు. దర్యాప్తులో తెలిసినవారే హత్యలు చేసినట్లు తేలింది. తాజాగా చేతన్‌కుమార్ హత్య కూడా ఇదే తరహాలోనే జరిగింది. బంధువులే ఈ హత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

త్వరలోనే కేసును ఛేదిస్తాం

బాలుడి హత్య కేసును త్వరలోనే ఛేదిస్తాం. అన్ని కోణాల నుంచి దర్యాప్తును కొనసాగిస్తున్నాం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానితులను విచారిస్తున్నాం.

– రామయ్య, సీఐ, మడకశిర

నేనేం చేశానమ్మా..

మూడురోజుల పసిగుడ్డును
ఆకలి.. చలి పక్కన నువ్వు లేక ఏడ్చా..
గుడిలోని దేవుడే దయతలచాడేమో..
దయగల తల్లెవరో చేరదీశారు
ఇప్పుడైతే ఇక్కడున్నా..రేపు ఎక్కడుంటానో
నేనేం చేశానమ్మా..నన్నెందుకు వద్దనుకున్నావ్
తప్పుచేశావో.. తప్పక వదిలించుకున్నావో
నావల్లే అంతా నిన్నే నిందిస్తున్నారు
నన్ను క్షమించు తల్లీ.. కానీ నువ్వంటే ఇష్టమమ్మా
మూడు రోజుల నీ స్పర్శ తలస్తూనే ఉంటా
మరో జన్మకైనా నీ రుణం తీర్చుకుంటా
ఆ పసికందుకు మాటలొస్తే ఇలాగే చెబుతాడేమో..



మూడురోజుల మగశిశువును ఎవరో సోమందేపల్లి మండలం చాలకూరు శివారులోని శివాలయం వద్ద శనివారం తెల్లవారుజామున వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపులు వినిపించడంతో సమీపంలోని వారు అక్కున చేర్చుకుని ఐసీడీఎస్ సిబ్బంది ద్వారా హిందూపురం ఆస్పత్రికి తీసుకు వెళ్లి పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు తెలపడంతో పుట్టపర్తిలోని శిశు గృహానికి తరలించారు. కాగా, బిడ్డను ఎవరు వదిలి వెళ్లారన్న దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

– సోమందేపల్లి:

ముదిగుబ్బ ఎంపీపీపై కేసు

పెనుకొండ: ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణపై 'కియా' పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు... పెనుకొండ మండలం గుట్టూరు రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 343–7బీలోని 86 సెంట్ల భూమికి ఆదినారాయణ ఫోర్జరీ డాక్యుమెంట్‌లు సృష్టించాడు. సదరు స్థలం తనదని చూపుతూ ఆ స్థలంలో నుంచి వెళ్లేందుకు తారురోడ్డు వేశాడు. అనంతరం 'కియా' అనుబంధ కంపెనీల గోదాములకు వెళ్లేందుకు ఆ స్థలాన్ని లీజుకు ఇచ్చాడు. అయితే స్థల యజమాని ఉరవకొండ మండలం రాకెట్లకు చెందిన నిఖిల్‌నాథ్‌రెడ్డి ఇటీవల భూమిని సర్వే చేయించాడు. తన స్థలంలో తారురోడ్డు వేసినట్లు గుర్తించాడు. అందుకు బాధ్యులైన ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ, రవి, వెంకటకృష్ణలపై 'కియా' పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన స్థలానికి సదరు వ్యక్తులు ఫోర్జరీ సంతకాలతో డాక్యుమెంట్లు సృష్టించి తారు రోడ్డు వేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఎస్‌ఐ రాజేష్ ఎంపీపీ ఆదినారాయణ, రవి, వెంకటకృష్ణలపై కేసు నమోదు చేశారు. కాగా ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ ప్రస్తుతం మంత్రి సత్యకుమార్ అనుచరుడిగా ఉన్నారు.

గోదాములకు వెళ్లలేని పరిస్థితి

ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ ఆక్రమించి తారురోడ్డు వేసిన భూమిని స్థల యజమాని స్వాధీనం చేసుకుని రోడ్డు మూసివేశాడు. దీంతో కొన్నేళ్లుగా ఈ దారి నుంచే కియా అనుబంధ కంపెనీల గోదాములకు వెళ్తున్న భారీ వాహనాలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. మరోదారి లేకపోవడంతో గోదాములకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరో వైపు చిన్నపరెడ్డిపల్లి గ్రామస్తులు కూడా ఈ దారినే ఏళ్లుగా వినియోగించుకుంటున్నారు. తాజా పరిణామాలతో వారికీ ఇబ్బందులు తలెత్తాయి.



మంత్రి సత్యకుమార్‌తో ఆదినారాయణ (ఫైల్)

క్లుప్తంగా

విద్యాభివృద్ధికి కృషి చేయండి



మాట్లాడుతున్న డీవైఈఓ రంగస్వామి

హిందూపురం టౌన్: విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉప విద్యాధికారి (డీవైఈఓ) రంగస్వామి సూచించారు. ఒకటి, రెండు తరగతులు బోధిస్తున్న జిల్లాలోని ఉపాధ్యాయులకు మండలంలోని బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మూడో విడత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఉప విద్యాధికారి రంగస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు గణితం, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో శ్రద్ధగా బోధించాలన్నారు. అర్థమైయ్యే రీతిలో బోధించినప్పుడు విద్యార్థులు మరింత చురుగ్గా తయారవుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, ఆంజనేయులు నాయక్, శేషాచలం, ఆర్పీలు శివయ్య, శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష దీపోత్సవం.. దేదీప్యమానం



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో శనివారం సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహించారు.మానంగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. తొలుత శనీశ్వరస్వామి, జ్యేష్ఠాదేవి ఉత్సవ విగ్రహాలను ఆలయం వెలుపల ప్రతిష్ఠించి అర్చకులు పూజలు చేశారు. దేవుళ్ల వద్ద ఏర్పాటు చేసిన దీపాలను వెలిగించారు. అనంతరం భక్తులు పోటాపోటీగా దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. వేడుకల్లో ఆలయ సమితి అధ్యక్షుడు ఆనందరావ్, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి సుబ్బనరసింహ తదితర పదాధికారులు పాల్గొన్నారు.

బాబు నోట.. మళ్లీ పాత పాటే!



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



భోజన ప్యాకెట్ల కోసం పోలీసుల పాట్లు

రాయదుర్గం: బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లులో శనివారం పర్యటించిన సీఎం చంద్రబాబు మళ్లీ పాత హామీలతోనే సరిపెట్టేశారు. కొత్త హామీలేమైనా ఇస్తారని గంపెడాశ పెట్టుకున్న ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేశారు. హంద్రీనీవా ద్వారా జీడిపల్లికి చేరే కృష్ణా జలాలతో బీటీపీని నింపుతామని 2017లో గుమ్మఘట్ట మండలం పూలకుంట వద్ద, 2018లో బీటీ ప్రాజెక్ట్ వద్ద ఏర్పాటు చేసిన సభల్లో ఇచ్చిన హామీనే మళ్లీ నేమకల్లులోనూ వల్లెవేశారు. ఉంతకల్లు రిజర్వాయర్ మంజూరు చేస్తానంటూ మమ అనిపించేశారు. ఎన్ని నిధులు కేటాయిస్తారు? ఎప్పటిలోపు పూర్తి చేస్తారు? తదితర వివరాలేవీ చెప్పకపోవడంతో ఇది ఇప్పట్లో సాధ్యమౌతుందా? అని స్థానికులు సందేహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా ద్వారా 36వ ప్యాకేజీ పనులు చేయిస్తామని గతంలో తానన్న మాటలనే మరోమారు చెప్పారు. గతంలో మాల్యం–ఆవులదట్ల బ్రాంచ్ కెనాల్ నిర్మిస్తామని, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో 20 వేల ఎకరాల్లో ఇసుక మేటల నివారణ కృషి చేస్తామని చెప్పిన ఆయన.. ఆ తర్వాత పైసా నిధులు విదల్చకపోయారు. మళ్లీ నేడు అవే హామీలు ఇవ్వడంతో ప్రజలు మండిపడ్డారు. 2014–19 మధ్య వేదావతి నదిలో సబ్‌సర్ఫేస్ డ్యాంల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి వదిలేశారని, మళ్లీ ఇప్పుడు అదే మాట చెప్పారని విమర్శించారు. బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మధ్య స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సరైన మార్గం చూపలేకపోయిన చంద్రబాబు.. ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక క్లస్టర్‌గా తయారుచేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం గమనార్హం.

'సూపర్ సిక్స్'పై స్పష్టత కరువు

సూపర్‌సిక్స్ హామీలపై నేమకల్లు సభలోనూ సీఎం చంద్రబాబు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం. లోటు బడ్జెట్ తెరమీదికి తెస్తూ హామీలపై దాటవేస్తూ ప్రసంగం సాగించారు. బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తానని బాబు చెప్పడంపై ప్రజలు నవ్వుకున్నారు.

తమ్ముళ్ల నిరాశ..

చంద్రబాబు నేమకల్లు పర్యటన తెలుగు తమ్ముళ్లను తీవ్ర నిరాశకు గురిచేసింది. అధినేతను కలవడానికి అవకాశం దొరక్కపోవడంతో టీడీపీకి చెందిన ముఖ్య నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బాబు తీరు అన్యాయంగా ఉందని పలువురు కార్యకర్తలు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలోనే ఆయనకు కార్యకర్తలు గుర్తుకువస్తారని, అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా సరైన భోజనం సౌకర్యం కల్పించకపోవడంతో పోలీసు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాక్టర్‌లో వచ్చిన భోజనం తీసుకునేందుకు అవస్థలు ఎదుర్కొన్నారు.

భక్తుల ఆవేదన..

ముఖ్యమంత్రి పర్యటన కారణంగా పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నేమకల్లు గ్రామంలోకి ఇతర గ్రామాలకు చెందిన వారు వెళ్లకుండా పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. నేమకల్లు క్రాస్, హీరేహాళ్, డీ.హీరేహాళ్ గ్రామాలకు వెళ్లే రోడ్లను మూసేశారు. కార్తీక మాసం చివరి శనివారం కావడంతో నేమకల్లు ఆంజనేయ స్వామి దర్శనానికి కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులను పోలీసులు అడ్డుకోవడంతో ఆవేదన చెందారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పుట్టపర్తిలో సభ్యత్వ నమోదు చేయిస్తున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

పుట్టపర్తి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నేతలతో కలిసి ఆయన పుట్టపర్తి, గోరంట్ల మండలాల్లోని పలు పాఠశాలలో వైఎస్సార్‌టీఏ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ అందించటంతో పాటు పాత బకాయిలు చెల్లిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా దీనిపై ఎటువంటి స్పందనా లేదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరవశభరితం.. సత్యసాయి అవతార వైభవం







సత్యసాయి అవతార వైభవం నృత్య నాటికలోని ఘట్టాలు

ప్రశాంతి నిలయం: సత్యసాయి లీలలను ప్రదర్శిస్తూ చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను పరవశభరితం చేశాయి. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన హైదరాబాద్ సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి అవతార వైభవం పేరుతో నృత్య నాటికను ప్రదర్శించారు. సత్యసాయి బోధనలు,సేవా కార్యక్రమాలను చక్కగా వివరించారు.

నిధులన్నీ అమరావతికి మళ్లించడమేంటి?

- అధికారులను నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు
- మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్‌కు అడుగడుగునా అవమానం



నిధుల మళ్లింపుపై నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

హిందూపురం: వార్డుల్లో రోడ్లు, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులు మెరుగుపరచడానికి గత ప్రభుత్వం వార్డుకు రూ.20 లక్షలు చొప్పున కేటాయించిన రూ.3.20 కోట్లు, 15వ ఆర్థికసంఘం కింద వచ్చిన రూ.8 కోట్ల నిధులను ఏకపక్షంగా రద్దు చేసి అమరావతికి మళ్లించడం ఏమిటని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. నూతన మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ బలరామిరెడ్డి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఇన్‌చార్జ్ చైర్మన్‌ను కమిషనర్, అధికారులు అడుగడుగునా అవమానపరిచారు. సమావేశం మొదలుకాకుండానే టీడీపీ కౌన్సిలర్లు కమిషనర్ చాంబర్‌లో మినిట్స్ బుక్‌లో సంతకాలు చేసి అన్నీ ఆమోదించామని అటు నుంచే వెళ్లిపోవాలని ప్రయత్నం చేశారు. ఈమాత్రం దానికి సమావేశం పెట్టడం ఎందుకు అంటూ ఇన్‌చార్జ్ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపేరీ పేరిట ఇంతవరకూ తనకు చాంబర్ ఇవ్వలేదని, ఇది ఎంతవరకు సబబని ఇన్‌చార్జ్ చైర్మన్ ప్రశ్నించడంతో...కమిషనర్ వచ్చి సర్దిచెప్పి కౌన్సిల్ హాలులోకి అందర్నీ రప్పించారు. వేదికపై వేసిన కుర్చీ కూర్చోగానే ఒరిగిపోయింది. చైర్ కూడా వేయకూడదని అనుకున్నారా అంటూ బలరామిరెడ్డి అసహనం వ్యక్తం చేశారు. దీంతో మరొక కుర్చీ తీసుకొచ్చి వేశారు. అనంతరం టీడీపీ కౌన్సిలర్లు 41 అంశాలతో తయారు చేయించిన అజెండాను ఏకపక్షంగా ఆమోదిస్తున్నామని టీడీపీ, బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు చేతులెత్తి బయటకు వెళ్లిపోయారు. కోరం ఉన్నపుడు అజెండాపై చర్చ జరగాలని వైఎస్సార్‌సీపీ పట్టుబట్టడంతో సమావేశం కొనసాగింది.

నిధుల కేటాయింపుపై అసహనం

వార్డుల అభివృద్ధికి మంజూరైన నిధులను మళ్లించడం ఏమిటని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లాలు ధ్వజమెత్తారు. కాలువల్లో పూడికతీత పనులకు ఇష్టానుసారంగా నిధులు కేటాయించారు. నాలుగు (33, 34, 35, 36) వార్డులకే వాస్తవ ధర కన్నా నాలుగు రెట్లు అదనంగా రూ.80 లక్షలు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు కమిషనర్, ఇన్‌చార్జ్ చైర్మన్‌కు అసమ్మతి లేఖ ఇచ్చారు.

మున్సిపాల్టీని అప్పులపాలు చేయాలనుకున్నారా?

అండర్ డ్రెయినేజీ వ్యవస్థకు రూ.450 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేస్తున్నామంటున్నారని, ఈనిధులన్నీ ఎక్కడి నుంచి వస్తాయని కౌన్సిలర్ నాగేంద్రబాబు ప్రశ్నించారు. ఇందుకు కమిషనర్ కేంద్ర నిధులు వస్తాయని సమాధానమిచ్చారు. ఇలా చెప్పే కర్ణాటకలోని చిక్‌బళ్లాపూర్ మున్సిపాల్టీలో అండర్ డ్రెయిన్ ఏర్పాటు అని వరల్డ్ బ్యాంకు వద్ద అప్పుచేసి చెల్లిస్తున్నారన్నారు. ఇదేరీతిలో ఈ అప్పు కూడా 'పురం' ప్రజల తలపై మోపుతారా అని నిలదీశారు. ఇలాగే సెంట్రల్ ఫండ్ అంటూ గొల్లపల్లి రిజర్వాయర్‌కు నిర్మాణానికి ఖర్చంతా మున్సిపాల్టీపై మోపితే నేటికీ నెలకు రూ.63 లక్షలు వడ్డీలు కట్టాల్సి వస్తోందన్నారు. ఇప్పుడు మరో స్కీం మున్సిపాల్టీపై గుదిబండ మోపి అప్పులపాలు చేస్తారా అని ప్రశ్నించారు. కౌన్సిలర్లు మల్లికార్జున, రోషన్ అలీ మాట్లాడుతూ చైర్మన్‌కు కనీస గౌరవం ఇవ్వకపోవడం మంచిది కాన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి బలవన్మరణం



వరదన్న (ఫైల్)

పెనుకొండ రూరల్: వెంకటగిరిపాళ్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న గాండ్ల వరదన్న (55) శనివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరదన్న కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపించుకున్నా నయం కాలేదు. తరచూ కడుపు నొప్పి వస్తుండటంతో జీవితంపై విరక్తి చెంది శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కియా పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆస్పత్రికి వెళ్లి వరదన్న మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్‌రెడ్డి, నగరపంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కొండలరాయుడు, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని పాదచారి మృతి



మృతి చెందిన లక్ష్మీనరసప్ప

మడకశిర రూరల్: మండలంలోని యు.రంగాపురం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాదచారి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జక్కేపల్లికి చెందిన లక్ష్మీనరసప్ప (58) యు.రంగాపురం హైవేపై నడుచుకుంటూ స్వగ్రామానికి వస్తుండగా మధుగిరి వైపు నుంచి మడకశిర వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన లారీని మడకశిరలో ప్రజలు అడ్డగించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

పొలంలో తిరగబడ్డ ట్రాక్టర్



మోతీరామ్‌నాయక్ (ఫైల్)



రోదిస్తున్న భార్య లక్ష్మమ్మ, కుటుంబ సభ్యులు



ట్రాక్టర్ మధ్యలో ఇరుక్కొని ప్రాణాలు విడిచిన మోతీరామ్‌నాయక్

రబీ సీజన్‌లో వరి సాగు చేయాలనుకున్నాడు. పొలం చదును చేస్తున్న క్రమంలో ట్రాక్టర్ తిరగబడింది. ట్రాక్టర్ కింద బురదలో ఇరుక్కుని రైతు దుర్మరణం చెందాడు. కళ్లెదుట జరిగిన ఈ ఘోరాన్ని భార్య జీర్ణించుకోలేకపోయింది. ఆమె రోదన అందరినీ కలచివేసింది.

- రైతు దుర్మరణం
- భార్య కళ్లెదుటే ఘోరం

రొళ్ల: రొటావేటర్‌తో దుక్కిచేస్తున్న సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి తిరగబడడంతో రైతు మోతీరామ్‌నాయక్ దుర్మరణం చెందాడు. వివరాల్లోకెళితే... ఆవినకుంట తండాకు చెందిన మోతీరామ్‌నాయక్ (55), లక్ష్మమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వరి సాగుకు పొలం సిద్ధం చేసేందుకు శనివారం భార్యతో కలిసి మినీ ట్రాక్టర్‌లో వెళ్లాడు. అక్కడ రొటావేటర్‌తో దుక్కి చేస్తున్నాడు. అలా అరగంట చేసిన తర్వాత ఎగుడుదిగుడు ప్రదేశంలో ట్రాక్టర్ ఒరిగి ఇరుక్కుపోయింది. బయటకు తీసేందుకు వెనక్కు ముందుకు కదిలిస్తుండగా ట్రాక్టర్ ఎడమవైపు బోల్తాపడింది. డ్రైవింగ్ చేస్తున్న మోతీరామ్ నాయక్ బురదలో ఇరుక్కుని విలవిలలాడాడు. భార్య గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల పొలాల్లోని రైతులు, మేకల కాపర్లు పరుగున వచ్చి ట్రాక్టర్‌ను పైకెత్తారు. మోతీరామ్‌నాయక్‌ను బయటకు తీయగా.. అప్పటికే అతను ప్రాణం విడిచాడు. దేవుడా ఎంత పనిచేశావయ్యా అంటూ భార్య విలపించింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ రొళ్ల, గుడిబండ మండలాల కన్వీనర్లు నరసింహారెడ్డి, డీఎల్ యంజారేగౌడు తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. సంఘటన స్థలాన్ని జమేదార్ రమణ, కానిస్టేబుల్ షఫీ పరిశీలించారు. మృతుని భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మడకశిర ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదివారం స్వగ్రామం ఆవినకుంటతండాలోని పొలంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మోతీరామ్‌నాయక్ రొళ్ల సింగిల్ విండో అధ్యక్షుడిగా 2020 నుంచి 2024 జూన్ 5 వరకు పనిచేశారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో దీపాలు పెడుతున్న మహిళలు

కరుణించు.. ఖాద్రీశా..!

కదిరి టౌన్: లక్ష్మీనారసింహస్వామి నామస్మరణతో ఆలయం ప్రతిధ్వనించింది. శనివారం ఖాద్రీశుని ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హెలిప్యాడ్ హెల్పర్‌కు పాముకాటు

బొమ్మనహాళ్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా నేమకల్లులో హెలిప్యాడ్ పనులు చేసేందుకు వచ్చిన హెల్పర్ షర్మస్ పాముకాటుకు గురయ్యాడు. శుక్రవారం రాత్రి హెలిప్యాడ్ పనులు ముగించి అక్కడే స్టేజీ వద్ద నిద్రించాడు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో షర్మస్ కుడి కాలు, తొడకు భాగంలో పాము కాటు వేసింది. వెంటనే తోటిహెల్పర్లకు తెలపడంతో వారు అతడిని బళ్లారి విమ్స్ తరలించారు. విషయం తెలిసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని షర్మస్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డగింత



ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

గుడిబండ: మండలంలోని గుడిబండ, సింగేపల్లి తదితర గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను శనివారం గుడిబండ గ్రామ ప్రజలు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా రాత్రీ పగలు తేడా లేకుండా హేమావతి గ్రామానికి అనుమతి ఇసుక రవాణా చేస్తున్నారన్నారు. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్



సీజ్ చేసిన వాహనాలు

ముదిగుబ్బ: ఇసుక అక్రమ రవాణాపై సీఐ రాముడు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. ఉప్పలపాడు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 4 ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను సీజ్ చేశారు. అనంతరం మైనింగ్ అధికారులకు అప్పజెప్పారు. సీఐ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.